నమస్తే తెలంగాణ
వరంగల్
5 | వరంగల్, శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | WARANGAL



హనుమకొండ కేడీసీలో ఓటు వేసేందుకు వచ్చిన మహిళా ఉపాధ్యాయులు

# పోలింగ్ ప్రశాంతం

**ఆయా జిల్లాల్లో పోలింగ్ శాతం**

| జిల్లా | మొత్తంఓట్లు | పోలైన ఓట్లు | పోలింగ్‌శాతం |
|---|---|---|---|
| జనగామ | 1,002 | 945 | 94.31 |
| హనుమకొండ | 5,215 | 4,780 | 91.68 |
| వరంగల్ | 2,352 | 2,214 | 94.13 |
| మహబూబాబాద్ | 1,663 | 1,571 | 94.47 |
| భూపాలపల్లి | 329 | 308 | 93.62 |
| ములుగు | 628 | 583 | 92.83 |
| సిద్దిపేట | 166 | 156 | 93.98 |
| భద్రాద్రికొత్తగూడెం | 2,022 | 1859 | 91.94 |
| ఖమ్మం | 4089 | 3,804 | 93.03 |
| యాదాద్రి | 984 | 950 | 96.54 |
| సూర్యాపేట | 2,664 | 2,530 | 94.97 |
| నల్లగొండ | 4,683 | 4,433 | 94.66 |
| మొత్తం | 25,797 | 24,132 | 93.55 |

**ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటింగ్ 93.55 శాతం**

- గతం కంటే 2.14శాతం పెరిగిన పోలింగ్
- పట్టణ ప్రాంతాల్లో బారులు తీరిన టీచర్లు
- మండల కేంద్రాల్లో మందకొడిగా..
- భారీ బందోబస్తు నడుమ బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు
- నల్లగొండలోని ఆర్జాలబావి గోదాముల్లో స్ట్రాంగ్‌రూమ్స్
- వచ్చే నెల 3న కౌంటింగ్

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. నియోజకవర్గ వ్యాప్తంగా 93.55 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రకటించారు. ఇంకా తుది లెక్కలు వెలువడాల్సి ఉందని, ఇందులో స్వల్ప తేడాలుండవచ్చని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికల్లో 19 మంది అభ్యర్థులు బరిలో నిలువగా 200 పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఓటు వేశారు. అందులో 150 పోలింగ్ కేంద్రాలు గ్రామీణ ప్రాంత మండల కేంద్రాల్లోనే ఉండడంతో అక్కడ ఓటింగ్ మందకొడిగా కొనసాగింది. పట్టణాలతోపాటు 11 జిల్లా కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఆయా ప్రాంతాల్లో ఓటర్లు బారులుదీరారు. కొన్నిచోట్ల పోలింగ్ ముగిసే సమయానికి కూడా ఓటర్లు క్యూలో వేచి ఉన్నారు. కాగా మొత్తం ఓటర్ల సంఖ్య 25,797 ఉండగా, ఇందులో 24,132 మంది టీచర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గం పరిధిలో సిద్దిపేట, జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలుండగా, వీటన్నింటిలో 91 శాతానికి పైగానే పోలింగ్ నమోదైంది. కాగా అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 96.54 శాతం నమోదవగా, అత్యధిక ఓట్లున్న హనుమకొండలో 91.66 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ ముగిసిన అనంతరం 12 జిల్లాల నుంచి బ్యాలెట్ బాక్స్‌లన్నీ ప్రత్యేక బందోబస్తు నడుమ అర్ధరాత్రి నల్లగొండకు తరలించి ఆర్జాలబావిలోని స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లోని స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచి సీల్ వేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతర నిఘాను ఏర్పాటు చేశారు. ఈ నెల 3న ఇక్కడే ఓట్ల లెక్కింపు జరుగనుండగా, అందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.



ములుగులో కలెక్టర్ టీఎస్ దివాకర సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌కు సీల్ వేస్తున్న ఎన్నికల సిబ్బంది

### గతం కంటే పెరిగిన ఓటింగ్

2019 మార్చిలో జరిగిన ఎన్నికల పోలింగ్‌తో పోలిస్తే ఈ సారి ఓటింగ్ శాతం పెరిగింది. గతంలో 20,888 మంది ఓటర్లుండగా అందులో 18,884 మంది ఓట్లేయగా, 90.41 శాతం పోలింగ్ నమోదైంది. అయితే ఈసారి ఓటర్ల సంఖ్యతో పాటు పోలింగ్ శాతం కూడా 2.14 శాతం పెరగడం గమనార్హం. గతంకంటే ఈసారి ప్రధాన సంఘాల అభ్యర్థుల సంఖ్య ఎక్కువుండడంతో అందరూ గెలుపు కోసం సర్వశక్తులొడ్డారు. దీంతో ఎక్కువ మంది ఓటర్లను కూడా అభ్యర్థులు కలవడం.. ఓటర్లు కూడా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్లను డబ్బు, మద్యం తదితర ప్రలోభాలూ ప్రభావితం చేసినట్లు చెబుతున్నారు.

### సజావుగా పోలింగ్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తి ప్రశాంతంగా కొనసాగింది. ఎక్కడా చిన్న ఘటన కూడా చోటుచేసుకోలేదు. పోలింగ్ సందర్భంగా ఆయా అభ్యర్థుల తరఫున సంఘాల నేతలు, అనుచరులు కేంద్రాల వద్ద సందడి చేసినా సజావుగా పోలింగ్ ముగియడంతో అధికారులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాల వెలుపల ఆయా సంఘాల నేతలు, కార్యకర్తలు తమ అభ్యర్థికి మద్దతుగా టెంట్లు వేసుకొని కూర్చున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు పోలింగ్ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిస్థితిని పర్యవేక్షించారు. రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి పోలింగ్ కేంద్రాలకు వెళ్లి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

### పట్టభద్రుల నియోజకవర్గంలో..

మెదక్–నిజామాబాద్–కరీంనగర్–ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ స్థానానికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాటారం డివిజన్ (కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాలు)లో మొత్తం 2,483 మంది ఓటర్లుండగా 1,903 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా 76 శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానంలో 83 మంది ఉపాధ్యాయ ఓటర్లుండగా 92 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే హనుమకొండ జిల్లా పరిధిలో మెదక్–నిజామాబాద్–కరీంనగర్–ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్, వేలేరు మండలాల్లో 4,585 మంది ఓటర్లుండగా 1,780 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా, 38.82 శాతం ఓటింగ్ నమోదైంది. ఇవే మండలాల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 166 మంది ఓటర్లుండగా, 103 మంది ఓటు వేయగా, 62.05 శాతం పోలింగ్ నమోదైంది.

# నీళ్లుండీ ఇవ్వలేని దుస్థితి

- సగం, ముప్పావు పొలాలు ఎండుతున్నయ్..
- కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తాకుతది..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పొట్టిగుట్ట, దేవునిగుట్ట తండాల్లో పంటల పరిశీలన



దేవునిగుట్ట తండాలో ఎండిన పొలం నుంచి ఇరిగేషన్ అధికారులతో ఫోన్లో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, ఫిబ్రవరి 27 : నీళ్లుండీ ఇవ్వలేని దుస్థితి పాలకుర్తి నియోజకవర్గంలో దాపురించిందని మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్ల లేక సగం, ముప్పావు పొలాలు ఎండుతున్నాయని, వాటిని రైతులు జీవాలకు అమ్ముకునే పరిస్థితి నెలకొందన్నారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని పొట్టిగుట్ట, దేవునిగుట్ట తండాల్లో గురువారం ఆయన పర్యటించగా, రైతులు తమ ఎండిన పొలాలను చూపించారు. వాటిని పరిశీలించిన ఆయన బోరున ఏడుస్తున్న రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి రైతుల ఉసురు తాకుతుందన్నారు. అప్పులు తెచ్చి యాసంగి నాట్లు పెడితే పొలాలు నెర్రెలు పడుతున్నాయన్నారు. రైతులు ఆశ చావక అప్పుతెచ్చి బోర్లు వేస్తూ ఇంకా అప్పుల పాలవుతున్నారన్నారు. దేవాదుల నీళ్లు వదిలితే ఇంత కష్టం ఉండకపోవన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా అధికారులతో మాట్లాడి ఇటు నవాబుపేట, అటు స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్ల నుంచి యాసంగి పంటకు నీళ్లు వదిలినట్లు చెప్పారు. చెరువులు, చెక్‌డ్యాంలు ఎండాకాలం అలుగులు పోసేవని, దీంతో భూగర్భ జలాలు పెరిగి, బోర్లు పోసి పంటలు పుష్కలంగా పండేవన్నారు. తాను సాగునీటి అధికారులకు ఎప్పుడు ఫోన్ చేసినా రెండు రోజుల్లో నీళ్లు వదులుతామంటున్నారే తప్ప విడుదల చేయడంలేదన్నారు. పచ్చని పాలకుర్తి నియోజకవర్గాన్ని ఎడారిగా మారుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. ప్రభుత్వానికి పంటలపై పట్టింపులేదని, కేసీఆర్ హయాంలో రైతుల కళ్లలో ఆనందం కనిపించేదన్నారు. ఏ ఊరు, ఏ తండాకు పోయినా కేసీఆర్ దేవుడంటున్నరని, మళ్లీ సారే రావాలని కోరుకుంటున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పెడితే కాంగ్రెస్ పార్టీని బొందపెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎర్రబెల్లి అన్నారు.

# విసిగి.. వేసారి

- సాగు నీటి కోసం కలెక్టరేట్ వద్ద రైతుల నిరసన
- కాల్వలకు నీరెందుకు విడుదల చేయడం లేదని ఆగ్రహం
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎదుట గోడు వెళ్లబోసుకున్న అన్నదాతలు

జనగామ రూరల్, ఫిబ్రవరి27: కాల్వలకు నీటిని విడుదల చేయాలని అధికారుల చుట్టూ తిరిగితిరిగి వేసారిన రైతులు గురువారం జనగామ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. తలాపునే రిజర్వాయర్, ప్రతి గ్రామానికి కాల్వలు ఉన్నా నీటిని ఎందుకు విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగామ మండలంలోని గానుగుపహాడ్, ఎర్రకుంట తండా, పెద్దపహాడ్, గోపరాజుపల్లి, వడ్లకొండ, బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి గ్రామాల రైతులు పెద్ద ఎత్తున ఇరిగేషన్ కార్యాలయానికి రాగా, సంబంధిత అధికారి అందుబాటులో లేకపోవడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకొని పల్లా రాజేశ్వర్ రెడ్డికి తమ గోడును వివరించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ రిజర్వాయర్‌కు గోదావరి జలాలు విడుదల చేసి తమ పంటలను కాపాడాలని రైతులు అధికారుల చుట్టూ తిరిగినా నీటిని విడుదల చేయడం లేదన్నారు. దేవాదుల నుంచి నీటిని పంపింగ్ చేసి బొమ్మకూర్ రిజర్వాయర్‌లో నీటిని నింపాలనే ఆలోచన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు లేదని, మరి ఏం పీకుతున్నారని మండిపడ్డారు. గతంలో ఒక గుంట ఎండిపోని భూమి నేడు నీళ్లులేక ఎండిపోయిన వందల ఎకరాల పొలాలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. రైతుల సమక్షంలోనే ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారి మంగీలాల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే జలాలు విడుదల చేయలని, లేకుంటే వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి వస్తుందన్నారు. రెండు, మూడు రోజుల్లో నీటిని విడుదల చేయడానికి కృషి చేస్తానని ఇరిగేషన్ అధికారి తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు మేకల కళింగ రాజు, గోవర్ధన్, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్ది లింగం, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు గద్దల నర్సింగరావు, మండల పార్టీ అధ్యక్షుడు బైరగోని యాదగిరి గౌడ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు బొల్లం శారద, మాజీ సర్పంచ్ శానబోయిన శ్రీనివాస్, రైతులు కొర్ర శంకర్ నాయక్, అయిలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

# ఉజ్వల భవిష్యత్తుకు భరోసా

- ఎంపీసీ తర్వాత ఏఐ, డేటా సైన్స్ కోర్సులకు మంచి డిమాండ్
- జేఈఈ, ఎంసెట్, ఇతర కోర్సులు, ప్లేస్‌మెంట్స్‌పై వక్తల సూచనలు
- ఇంటర్ తర్వాత ఉన్నత విద్యావకాశాలపై అవగాహన సదస్సు
- 'నమస్తే తెలంగాణ-కేఎల్ యూనివర్సిటీ' ఆధ్వర్యంలో నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

## అవకాశాలను అందిపుచ్చుకుంటే విజయం మీదే

*ఇంటర్ తర్వాత ఏ కోర్సు తీసుకోవాలి? అందుకోసం ఏ కాలేజీలో చేరాలి? ఎక్కడ ప్రవేశం పొందితే జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చు? అనే ప్రశ్నలు ప్రస్తుతం ఇంటర్ పూర్తయ్యే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి. ఈ క్రమంలో అటు విద్యార్థులు సందేహాలను నివృత్తి చేసి వారి ఉజ్వల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడంతో పాటు పిల్లలపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు, కలలను నిజం చేసే సువర్ణావకాశం వారి ముందుకొచ్చింది. ఈ క్రమంలో ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్యావకాశాలపై 'నమస్తే తెలంగాణ-కేఎల్ యూనివర్సిటీ' సంయుక్తంగా జనగామ జిల్లాకేంద్రంలోని ఎస్‌ఎస్‌ఎన్ గార్డెన్‌లో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి భవిష్యత్ ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు.*

*-జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 27*

### విద్యార్థులకు చక్కని వేదిక కేఎల్



ఇంటర్ పూర్తయిన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కేఎల్ యూనివర్సిటీ భరోసా కల్పిస్తుంది. ఒకే చోట అనేక కోర్సులను అందిస్తున్న ఏకైక విద్యాసంస్థ ఇది. ఈ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులు ఇవాళ యూఎస్ఏ, యూకే, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఉద్యోగాలు సాధించి వారి లక్ష్యాన్ని చేరుకున్నారు. బెస్ట్ కాలేజీ, బెస్ట్ కోర్సు, బెస్ట్ ప్లేస్‌మెంట్, బెస్ట్ ప్యాకేజీ పొందేందుకు విద్యార్థులకు కేఎల్ వర్సిటీ ప్రస్తుతం అన్ని రకాలుగా అందుబాటులో ఉంది. తమ కలలను నిజం చేసుకునేందుకు కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులకు అనువైన వేదిక.

*– డాక్టర్ కే శ్రీనివాస్, ప్రొఫెసర్ కేఎల్ యూనివర్సిటీ*

### ఉన్నత లక్ష్యానికి మార్గం



విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని చేరుకోవడానికి కేఎల్ యూనివర్సిటీ ఒక మార్గం. ఈ సమయంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీసుకునే సరైన నిర్ణయం భవిష్యత్‌ను నిర్దేశిస్తుంది. ఏఐ, ఏఐ డేటా సైన్స్ వంటి కోర్సుల ఎంపిక, మంచి కళాశాలలో చేరికను బట్టి ప్లేస్‌మెంట్లు దొరుకుతాయి. విద్యాసంస్థలో కల్పిస్తున్న వసతులు, వెల్ క్వాలిఫైడ్ ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్స్‌పై విద్యార్థుల భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. దానికి కేఎల్ యూనివర్సిటీ గొప్ప మార్గదర్శి. చదువే కాదు క్రీడలు, యోగా కూడా విద్యార్థులకు ఒక భాగంగా ఉండాలి. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇది కృషిచేస్తుంది.

*– కే మాధవీ లత, అసిస్టెంట్ ప్రొఫెసర్ కేఎల్ యూనివర్సిటీ*

కెరీర్ గైడెన్స్ సదస్సుకు విశేష స్పందన వచ్చింది. వక్తల సూచనలు, సలహాలు విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం నింపాయి. ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, బీ ఫార్మసీ, బీబీఏ వంటి కోర్సులు తీసుకుంటే వచ్చే అవకాశాల గురించి ఈ సందర్భంగా వక్తలు వివరించారు. ఈ సమయంలో తీసుకునే నిర్ణయం జీవితంలో సక్సెస్ అయ్యేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటే మున్ముందు జీవితం సాఫీగా సాగుతుందని పేర్కొన్నారు. ఎంపీసీ తర్వాత ఏఐ, ఏఐ డేటా సైన్స్ వంటి కోర్సులకు ప్రస్తుతం చాలా డిమాండ్ ఉన్నదన్నారు. కేఎల్ యూనివర్సిటీలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, వెల్ క్వాలిఫైడ్ ఫ్యాకల్టీ, ప్లేస్‌మెంట్స్ గురించి సవివరంగా అవగాహన కల్పించారు. సుమారు 90 కంపెనీలు అందిస్తున్న ప్లేస్‌మెంట్స్‌తో పాటు పర్ యానమ్ మినిమమ్, మాగ్జిమమ్, హయస్ట్ రేంజ్‌లో ఇస్తున్న ప్యాకేజీల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అంతేగాక కేఎల్ యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు రూ.10 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉన్నదన్నారు. కేఎల్‌లో అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు తమ సందేహాల నివృత్తికి సెల్ నంబర్ 7997995708లో సంప్రందించాలని సూచించారు. ఇంటర్ ఫస్టియర్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన నలుగురు విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలతో పాటు సదస్సుకు హాజరైన విద్యార్థుల్లో ఒకర్ని లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసి రిస్ట్ వాచ్‌ను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ అడ్మిషన్ మేనేజర్లు బి.నవీన్, ఎం.ప్రవీణ్, నమస్తే తెలంగాణ ఏడీవీటీ వరంగల్ యూనిట్ డిప్యూటీ మేనేజర్ అప్పని సూరయ్య, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమానికి వచ్చిన విద్యార్థులు



ప్రతిభచూపిన విద్యార్థులతో నమస్తే తెలంగాణ, కేఎల్ యూనివర్సిటీ యాజమాన్యం

### మంచి అవకాశం



ఇంటర్ తర్వాత ఏం చదవాలి? ఎక్కడ చేరాలనుకునే విద్యార్థులకు ఇది మంచి అవకాశం. అనేక మంది విద్యార్థుల భవిష్యత్‌ను ఉజ్వలంగా మార్చేందుకు ముందుకొచ్చిన కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ, నమస్తే తెలంగాణ పత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు. కెరీర్ గైడెన్స్‌పై సరైన అవగాహన ఉంటే సక్సెస్ రేట్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉత్తమ కోర్సులను ఎంపిక చేసుకునేందుకు ఈ అవగాహన సదస్సు ఉపయోగపడుతుంది.

*– కే కనకరాజు, ప్రిన్సిపాల్ ఏబీవీ జూనియర్ కళాశాల*

### నమ్మకం పెరిగింది



ఈ కెరీర్ గైడెన్స్ తర్వాత నాలో నమ్మకం మరింత పెరిగింది. జీవితంలో గొప్పగా స్థిరపడాలంటే ఇప్పుడే సరైన నిర్ణయం తీసుకోవాలని వక్తలు వివరించిన తీరు నన్ను బాగా ఆకట్టుకుంది. ప్రపంచ దేశాల్లో కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు సాధించిన ప్లేస్‌మెంట్స్, పొందుతున్న ప్యాకేజీలు నాలో రెట్టింపు ఉత్సాహాన్నిచ్చింది. ఇంకా బాగా పట్టుదలతో చదువుతా. మా తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకొస్తా.

*– కే రాకేశ్, విద్యార్థి*

### కొత్త కోర్సులు పరిచయం చేశారు



ఇంటర్ తర్వాత కామన్‌గా అందరు చదివే కోర్సులు కాకుండా ఏఐ, ఏఐ డాటా సైన్స్ వంటి కొత్త కోర్సులను పరిచయం చేశారు. ఆ కోర్సుల్లో చేరాలని నాకు ఆసక్తిగా ఉంది. జీవితంలో బాగా ఎదగాలంటే మంచి లైఫ్ ఉన్న కోర్సును, కాలేజీని సెలెక్ట్ చేసుకోవాలని అర్థం అయ్యింది. ఇక నుంచి మంచి ప్రణాళికతో చదువుతా. ఉత్తమ ఫలితాలను సాధిస్తా.

*– జే భార్గవి, విద్యార్థిని*

### కలలను నిజం చేసుకోవాలి



భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి. ప్రతి విద్యార్థి గొప్ప కలలు కనడమే కాదు.. వాటిని నిజం చేసుకోవాలి. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు సరైన ప్రణాళిక రూపొందించుకోవాలి. కేఎల్ యూనివర్సిటీ–నమస్తే తెలంగాణ కెరీర్ గైడెన్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి. చదువుతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి.

*– పందిళ్ల అశోక్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ నమస్తే తెలంగాణ వరంగల్ యూనిట్*

### సద్వినియోగం చేసుకోవాలి



ఈ కెరీర్ గైడెన్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఇంటర్ తర్వాత ఏం చదవాలన్న ప్రశ్నకు సమాధానంగా కేఎల్ యూనివర్సిటీ–నమస్తే తెలంగాణ అవగాహన సదస్సు ఎంతో ఉపకరిస్తుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇదెంతో మేలు. సంప్రదాయ కోర్సులకు భిన్నంగా సరికొత్త కోర్సులు ఇవాళ విద్యార్థులకు పరిచయం చేశారు. వాటితో ఉజ్వల భవిష్యత్ ఉంటుంది.

*– శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీ గాయత్రి జూనియర్ కళాశాల*

### సందేహాలు తీరాయి..



ఈ కెరీర్ గైడెన్స్‌తో నాకు ఇప్పటి వరకున్న సందేహాలు తీరాయి. ఇంటర్ తర్వాత ఏ కోర్సు తీసుకుంటే బాగుంటుందనే ప్రశ్నకు సమాధానం దొరికింది. మా తల్లిదండ్రులతో మాట్లాడి కేఎల్ యూనివర్సిటీ కళాశాలలో బీటెక్‌లో చేరుతా. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడాలనే నా కోరికను నిజం చేసుకుంటా. థ్యాంక్స్ టూ కేఎల్ యూనివర్సిటీ అండ్ నమస్తే తెలంగాణ. *– కే పావని, విద్యార్థిని*